# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం। 7। అక్టోబర్। 2025




**ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. -8లో



**ఈ-నామ్ పద్ధతి మాకొద్దు**

ఈ-నామ్ పద్ధతి మాకొద్దంటూ చీనీ రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఈ-నామ్ పద్ధతిలో చీనీ కాయల వేలంపాట నిర్వహించారు. -8లో

గరిష్టం/కనిష్టం 34.2/22.6

**వాతావరణం**

జిల్లాలో సోమవారం 22.6 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### బాధ్యతల స్వీకరణ



నాగరత్నమ్మ

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 డిప్యూటీ డైరెక్టర్‌గా నాగరత్నమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహించారు. పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ వనిషా, రవి, మానస తదితరులు నాగరత్నమ్మను అభినందించారు.

### భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



త్రేతేశ్వరునికి గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రాజంపేట రూరల్: ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వర స్వామికి పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా బహుదానదికి గంగా హారతి ఇచ్చారు. అనంతరం కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువు దీర్చారు. భక్తులు పల్లకిని లాగుతూ..భక్తి పాటలు పాడుతూ..శివనామస్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం రాజంపేటకు వచ్చే భక్తులకు చెర్రీస్ స్కూల్ యజమాన్యం వారు బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు సిద్దా లింగారెడ్డి, కార్యదర్శి పోకల ప్రభాకర్, కోశాధికారి వై నందకిషోర్‌గౌడ్, కమిటి సభ్యులు యుపీరాయుడు, బాలక్రిష్ణా రెడ్డి, రాఘవరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

### గాలి, వానకు దెబ్బతిన్న వరిపంట



లింగంపల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి

సిద్దవటం: మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లి, కడప యాపల్లి, లింగంపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరిపంట ఆదివారం రాత్రి వీచిన గాలులకు దెబ్బతింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వంద ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. రైతులు జూన్ నెల చివరి వారంలో వరి సాగు చేశారు. ఎకరా పంటకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. ఈ నెల చివరిలో పంటను కోయాల్సిన సమయంలో గాలి, వానలకు నేలకొరిగి దెబ్బతింది. గతంలో పంట నష్టానికి ప్రభుత్వం బీమా కల్పించేదని, అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# చినుకు రాలె.. విత్తనం రాలే..

- జిల్లాలో భారీ వర్షం
- రబీసాగుకు ఈ వర్షం మేలే..
- సబ్సిడీ విత్తనాల పంపిణీ ఆలస్యంతో ఉసూరుమంటున్న అన్నదాతలు



మైదుకూరు ప్రాంతంలో వర్షం నీటితో మునిగిన ఉల్లిపంట

కడప అగ్రికల్చర్: కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు కాలం కలిసిరావడం లేదు. సకాలంలో వర్షాలు కురిస్తే విత్తనాలు అందడం లేదు. పంట చేతికొస్తే మద్దతు ధర దక్కడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మద్దతు ధర లేక అవస్థ పడ్డ రైతన్నలు రబీలోనైనా లాభాలు గడించాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు వర్షం కూడా పలకరించింది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా వానదేవుడు పలకరించినా కూటమి ప్రభుత్వం కాస్తకూడా కనికరించడం లేదు. సకాలంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయడానికి మనసే రాలేదు. లేదంటే ఈ పదును వానకి రైతులు కాడి కట్టి సాగుకు సిద్ధమయ్యేవారు. ప్రభుత్వం విత్తనాలను కొనుగోలు చేసి రైతు సేవా కేంద్రాలకు చేరవేసి విత్తనాల పంపిణీ చేసేలోపు పుణ్యకాలం ముగిసిపోతుందేమోనని రైతుల్లో కలవరం మొదలైంది.

**రెండు మండలాలు మినహా అంతటా వర్షం..**

ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో సోమవారం తెల్లవారుజాము నుంచి వర్షం దంచి కొట్టింది. జిల్లావ్యాప్తంగా పోరుమామిళ్ల, ఒంటిమిట్ట మినహా మిగతా 34 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కొండాపురంలో 93.2 మి.మీ వర్షం కురిసింది. ఈ వర్షం రబీలో శనగసాగుకు ఎంతో మేలు. కూటమి ప్రభుత్వంలో ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల విత్తనాల పంపిణీ ఇంకా ఆలస్యం అయ్యేటట్లు కనిపిస్తోంది. ఇంకా శనగ విత్తనాల కొనుగోలులోనే తలమునకలవుతున్నట్లు సమాచారం. విత్తనాల పంపిణీ ప్రక్రియ కార్యక్రమం ముగిసిలోపు ప్రస్తుత వర్షం పదును ఆరిపోతుందని రైతులు వాపోతున్నారు. అదే రబీ ప్రారంభంలోనే రైతులకు శనగ విత్తనాలను అందించి ఉంటే ఈ వర్షానికి చాలా మంది రైతులు శనగపంటను సాగు చేసుకునే వారు.

**భారమైనా..**

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది రబీ సీజన్‌కు లక్ష ఎకరాల దాకా శనగపంట సాగుకానున్నట్లు అంచనా. కాగా సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ ఊసే లేకపోవడంతో అన్నదాతలు భారమైనా బయట ప్రాంతంలో కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. సకాలంలో సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయని కూటమి ప్రభుత్వంపై రైతులు రైతు సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**టెండర్‌దారుల మెలిక**



గతేడాది శనగ విత్తనాలకు కొనుగోలుకు సంబంధించిన బకాయిలను ఇస్తేనే విత్తనాలను సరఫరా చేస్తామని టెండర్‌దారులు చెప్పినట్లు సమాచారం.ఇప్పటికే టెండర్‌దారులు కొంతమేర విత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలిసింది. బకాయిలను చెల్లిస్తేనే పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి అందిస్తామని షరతు విధించినట్లు సమాచారం.

**పంట పొలాల్లో వర్షపు నీరు...**

సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పలు పంటల్లో వర్షపు నీరంతా నిలబడింది. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో ఉల్లి, పసుపు పంటలు పూర్తిగా నీటి మునిగాయి. అలాగే బద్వేల్ ప్రాంతంలో కూడా పలు పంటలు నీట మునిగాయి. బద్వేలు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. అలాగే బద్వేలు ఆర్టీసీ గ్యారేజీ లోకి వర్షపు నీరంతా చేరడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ఎర్రగుంట్లలో అధిక వర్షం కారణంగా వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న గౌసియా మిద్దె పైకప్పు కూలి పడింది, దీంతోపాటు పలు ప్రాంతాల్లో పంట పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి.

**పత్తికి..ఉల్లికి నష్టమే..**

ఇటీవల కురిసిన వరుస వర్షాలతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పత్తి పంట దెబ్బతింది. ఉల్లి పంటకు ఈ వర్షంతో నష్టమే. చాలా ప్రాంతాల్లో గడ్డలు ఊరి పంట కోత దశకు చేరుకుంది. ఈవర్షంతో వర్షపు నీరు పంట పొలంలో నిలబడటంతో గడ్డలు కుళ్లిపోతాయని ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు.

**కొండాపురంలో అత్యధిక వర్షం**

ఉపరితల ఆవర్తనం కారణంగా కురిసిన వర్షాల్లో కొండాపురంలో అత్యధిక వర్షం 93.2 మి.మీ కురిసింది. అలాగే బద్వేల్లో 92.4, చక్రాయపేటలో 83.2 , గోపవరంలో 70 , పెండ్లిమర్రిలో 68.4, బి.మఠంలో 62.2, కడపలో 60.8, దువ్వూరు, చెన్నూరులలో 47.8, చాపాడులో 45.8, పొద్దుటూరులో 44.6, ఎర్రగుంట్లలో 43.0, ముద్దనూరులో 41.4, వేములలో 38, వేంపల్లిలో 37.2, అట్లూరు, మైదుకూరులలో 36.8, సికెదిన్నెలో 35.4, వీఎన్‌పల్లిలో 31.6, తొండూరులో 30.4, మైలవరంలో 28.6, సిద్దవటంలో 26.8 , పెద్దముడియంలో 23.4 , సింహాద్రిపురంలో 18.8, లింగాల, రాజుపాలెంలలో 17.2 , కలసపాడులో 12.6 , కమలాపురంలో 8.2 , పులివెందుల్లో 8, ఖాజీపేటలో 7, బి.కోడూరులో 4.8 మి.మీ వర్షం కురిసింది.

**వర్షంతో రాకపోకలు బంద్**



రాజుపాళెం- వెంగళాయపల్లె మధ్యనున్న వంకపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

రాజుపాళెం: మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీటితో ప్రొద్దుటూరు-ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఆ దారిలో రాజుపాళెం - వెంగళాయపల్లె గ్రామాల మధ్యలో, రాజుపాళెం - అయ్యవారిపల్లె గ్రామాల మధ్యలో ఉన్న మదువంక వద్ద ఉన్న లోలెవెల్ కాజ్‌వేపై వర్షం నీరు మూడు నుంచి నాలుగు అడుగుల మేర ఉధృతంగా ప్రవహించింది. ఆదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పర్లపాడు, అర్కటవేముల గ్రామాల్లోని కొన్ని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు రావడంతో వారంతా ఆందోళన చెందారు.



బద్వేలు ఆర్టీసీ గ్యారేజీలోకి చేరిన వర్షపునీరు



మైదుకూరు మండలంలో మునిగిన వరిపంట



బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో భారీగా నిలిచిన వర్షపునీరు

# అర్జీలకు సత్వర పరిష్కారం

**కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు వేగంగా, నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అనంతరం అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఎస్డీసి వెంకటపతి,జడ్పీ సీఈఓ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 'గండికోట' నిర్వాసితుల పరిహారానికి కృషి

కడప సెవెన్‌రోడ్స్: గండికోట జలాశయ నిర్వాసిత గ్రామస్తులకు న్యాయబద్ధమైన పరిహారం, పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్‌ఎస్ హాలులో గండికోట జలాశయం ముంపు గ్రామస్తులకు పునరావాసం, పరిహారం, మౌలిక సదుపాయాలు కల్పించే అంశమై ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితి సింగ్, ఆర్డీవో సాయిశ్రీలతో కలిసి గ్రామస్తులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో కొన్ని అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించిన సమస్యలపై ఆయా గ్రామస్తుల నుంచి కలెక్టర్, ఎమ్మెల్యేలు అర్జీలను స్వీకరించారు.

### స్ఫూర్తినింపే 'స్వచ్ఛ' పురస్కారాలు




అవార్డులు అందుకున్న వారితో కలెక్టర్, ఇతర అధికారులు


కడప సెవెన్‌రోడ్స్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ ఆంధ్రా పురస్కారాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాయని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సభా భవన్‌లో 'స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు-2025'ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి 3వ శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించడం ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామం స్వచ్ఛతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెల కట్టలేనివని అభివర్ణించారు. ముందుగా రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న వారికి, 48 జిల్లా స్థాయి అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరికీ శుభాభివందనాలు తెలియజేశారు. జేసీ అదితి సింగ్ మాట్లాటారు. అనంతరం అవార్డులకు ఎంపికైన వారికి జ్ఞాపికలు బహుకరించారు.

# అంతా గప్ చుప్!

- నకిలీ మద్యం వ్యవహారంతో మూతపడిన బెల్ట్ షాపులు
- నిల్వల కోసం కొనసాగుతున్న ఎక్సైజ్ పోలీసుల సెర్చ్ ఆపరేషన్
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిపై సస్పెన్షన్ వేటుతో పార్టీలో ప్రకంపనలు



ములకలచెరువులో నకిలీమద్యం తయారీ కేంద్రం



సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో నకిలీ మద్యం వ్యవహారం టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.ఎక్కడికక్కడ జిల్లాలో ఉన్న బెల్ట్‌షాపులుమూతపడుతున్నాయి. తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతంలోని బెల్ట్‌షాపులు ఇప్పటికే మూసివేశారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఎక్కడా నిర్వహించకుండా ఎక్సైజ్‌శాఖతో పనిలేకుండా పోలీసుశాఖ రంగంలోకి దిగడంతో అంతా గప్‌చుప్‌గా మారింది. ఇప్పటికే నకిలీ మద్యం వ్యవహారం ఒక్క అన్నమయ్య జిల్లాలోనే కాకుండా విజయవాడ పరిధిలోని ఇబ్రహీంపట్నంలో బట్టబయలు కావడంతో మద్యం ప్రియుల్లో ఆందోళన నెలకొంది. అయితే గత కొన్నినెలలుగా బెల్ట్‌షాపులకు యథేచ్ఛగా సరఫరా జరిగిన నేపథ్యంలో ఇప్పటికే రోజుల తరబడి సేవించిన వారి పరిస్థితి ఏమిటన్నది అర్థం కావడం లేదు.

**టీడీపీలో నకిలీ మద్యం ప్రకంపనలు**

జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో నకిలీ మద్యం వ్యవహారం టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇందులో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న జయచంద్రారెడ్డితోపాటు కేసులో దొరికిన సురేంద్రనాయుడులను పార్టీ సస్పెండ్ చేసింది. ప్రభుత్వం తరుపున చంద్రబాబు సీరియస్‌గా ఉన్నాడని మెసెజ్ ఇస్తూనే మరోవైపు కేసుల విషయంలో పార్టీ కీలక నేతలు లేకుండా లోలోపల వ్యవహారాలను నడుపుతున్నట్లు ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. జయచంద్రారెడ్డిపై అధిష్టానం చర్యలకు ఉపక్రమించడంతో మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులు లోలోపల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్న దృష్ట్యా ఈ వ్యవహారం ప్రత్యర్థి వర్గానికి అవకాశంగా మారింది.

**పోలీసుశాఖ అప్రమత్తం**

జిల్లాలో కల్తీ మద్యం వ్యవహారం కలకలం రేపుతున్న తరుణంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. జిల్లా ఎస్పీ ధీరజ్ ప్రత్యేకంగా ఎక్కడికక్కడ ఉన్న బెల్ట్‌షాపులు మూతవేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అన్నిచోట్ల మూతపడుతున్నాయి. మరోవైపు మద్యానికి సంబంధించి ఎలాంటి అక్రమ వ్యవహారాలు సాగినా చర్యలు తప్పవని ఇప్పటికే పోలీసుశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో ఒక్క తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతాల్లోనే కాకుండా రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు ఇలా అన్నిచోట్ల బెల్ట్‌షాపులపై చర్యలు చేపడుతున్నారు. దీంతో తమకెందుకులే సమస్య అంటూ బెల్ట్‌షాపుల నిర్వాహకులు మూత వేస్తున్నారు.

**ఎక్సైజ్‌శాఖ సెర్చ్ ఆపరేషన్**

జిల్లాలో ఎక్సైజ్‌శాఖ సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తోంది. అందిన రహస్య సమాచారం మేరకు సోమవారం కురబలకోట మండలంలో దాడులు చేపట్టారు. మిగతా చోట్ల కూడా ఎక్కడికక్కడ నిల్వల కోసం కొండలు, గుట్టలు, తోటలు ఇలా అన్ని ప్రాంతాల్లో ఆపరేషన్ కొనసాగుతోంది.మొత్తం మీద నకిలీ మద్యం వ్యవహారం ఒక వైపు కేసులు, మరోవైపు నేతల సస్పెన్షన్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న టీడీపీలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయో అన్న అంశం పార్టీ వర్గాలను వెంటాడుతోంది.

**బెల్ట్‌షాపు నిర్వాహకుల్లో వణుకు**

జిల్లాలో నాలుగు రోజుల కిందట ములకలచెరువు సమీపంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు సురేంద్రనాయుడుతోపాటు మరికొంత మంది కీలక నేతలు ప్రత్యేకంగా నకిలీ మద్యం తయారు చేసిన వ్యవహారాన్ని ఎక్సైజ్ పోలీసులు మట్టికరిపించారు. అయితే తయారీ కేంద్రం నుంచి మదనపల్లె, తంబళ్లపల్లెతోపాటు సుమారు 75-80 బెల్ట్‌షాపులకు నకిలీ మద్యం సరఫరా చేసినట్లు ఎక్సైజ్‌శాఖకు దొరికిన డైరీలో నిక్షిప్తమై ఉంది. ఈ పరిస్థితుల్లో బెల్ట్‌షాపు నిర్వాహకులు ముందుకు పోతే నుయ్యి..వెనక్కిపోతే గొయ్యి అన్నచందాన వణికి పోతున్నారు. ఎందుకంటే వారు ప్రజలకు విక్రయించింది నకిలీ మద్యం కావడంతో ఇప్పుడు మద్యం ప్రియుల నుంచి కూడా తిరుగుబాటు ఎదురవుతుందన్న భయం వెంటాడుతోంది. కేసుల్లో ఇరుక్కుమంటామనే ఆందోళన కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తంబళ్లపల్లె పరిధిలోని రెండు వైన్‌షాపులను సీజ్ చేసిన అధికారులు ఇంకా ఎక్కడైనా మద్యం షాపులకు నకిలీ మద్యం సరఫరా జరిగిందా అన్న కోణంలో కూడా విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఎక్సైజ్‌శాఖ అధికారులకు దొరికిన జాబితా ప్రకారం విచారణ చేస్తుండడంతో బెల్ట్‌షాపులు నిర్వాహకులు దిక్కుతోచక బెంబేలెత్తిపోతున్నారు. నాలుగు రోజులుగా బెల్ట్‌షాపులను ఎక్కడికక్కడ మూతవేసినా ఎప్పుడు ఎలాంటి సమాచారంతో ఫోన్ వస్తుందన్న ఆందోళనతో ఆందోళన చెందుతున్నారు.

# ఏపీని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చారు

**కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి**



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చాడని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విపరీతంగా కల్తీ మద్యం తయారు చేసి తెలుగుదేశం పార్టీ నేతలు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. అక్రమ ఆదాయమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం స్వయంగా తమ పార్టీ నేతలతో అక్రమ మద్యం తయారు చేయిస్తోందన్నారు. ఇందుకు అన్నమయ్య జిల్లా ములకలచెరువు ఘటనే ఉదాహరణ అని.. అందులో టీడీపీ నేతలు అక్రమ మద్యం తయారీలో భాగస్వామ్యులైన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. వీరి వెనుక పెద్ద బాబు, చిన్న బాబులు ఉన్నారనేది కూడా తెలిసిన విషయమేనన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి మద్యం కుంభ కోణం జరగకపోయినా తమ పార్టీపై నిందలు మోపేందుకు అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి తమ పార్టీ నేతలపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న మద్యం కుంభకోణం గురించి టీడీపీ నేతలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అనంతరం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు.

**మా పొలాలకు రస్తా కావాలి..**

సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని గోటూరు, సిద్ధంరెడ్డిపల్లె, బొగ్గుడుపల్లె, పెద్దజూటూరు గ్రామాలకు చెందిన రైతులు కలిశారు. ఈ సందర్భంగా రైతులు ఎంపీతో మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు తమ భూములలో కొంత భాగం కోల్పోయామని, అందుకు సంబంధించి తమకు నష్టపరిహారం కూడా అందించారన్నారు. మిగిలి ఉన్న భూములలో పంటలు పండించుకోవడానికి వెళ్లేందుకు రస్తా లేదని వాపోయారు. ఇందుకు సంబంధించి అధికారులను ప్రశ్నిస్తే నష్టపరిహారం ఇచ్చామని చెబుతున్నారని, మిగిలి ఉన్న భూములకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. అలాగే హైవే రోడ్డుతో తమకు సమస్య లేదని, దాని కింద ఉన్న సర్వీస్ రోడ్డు ద్వారా 10అడుగుల మేర రస్తా కావాలని అడిగారు. సర్వీస్ రోడ్డు ఇరువైపులా కంచె ఏర్పాటు చేయడంవల్ల భూముల్లోకి వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని ఎంపీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీ అధికారులకు ఫోన్ చేసి వెంటనే రైతుల సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు.

## క్లుప్తంగా

### కూలిన మట్టి మిద్దె



కూలిన ఇంటి పై కప్పు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పురపాలక సంఘం పరిధిలోని వినాయకనగర్ కాలనీలో నివాసం ఉండే షేక్ గౌసియా ఇంటిపై కప్పు వర్షం వల్ల మట్టి తడిసి దూలాలు విరిగి పోయి సోమవారం తెల్లవారుజామున కూలి పోయింది. ఆ సమయంలో గౌసియా ఇంటిలో లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సందర్భంగా బాధితురాలికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాడిశెట్టి శివకుమార్ వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్ శోభన్‌బాబుకు ఆధారాలతో కూడిన వినతి పత్రం అందించారు. బాధితురాలు బాడుగ ఇంటిలో ఉంటుందని, మిద్దె కూలడంతో ఇంటిలోని విలువైన సామగ్రి తోపాటు సరుకులు దెబ్బతిన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భార్యపై భర్త దాడి

మదనపల్లె : భార్యపై భర్త దాడి చేసిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక శేషప్పతోటలో కాపురం ఉంటున్న కేవీ రమణ భార్య శశికళ (50) గత 20 ఏళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. పిల్లలకు వివాహమై స్థిరపడ్డారు. ఈ క్రమంలో తరచూ కేవీ రమణ భార్య కోసం ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. వారి మధ్య ఏం జరిగిందో కానీ ఉదయం శశికళ వంట చేస్తుండగా భర్త, మరిది దాడి చేసి గాయపరిచారు. బాధితురాలిని స్థానికులు వైద్యం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### కారు ఢీకొని రైతు దుర్మరణం

కురబలకోట : మండలంలోని దొమ్మన్నబావి సర్కిల్ వద్ద సోమవారం కారు ఢీకొన్న సంఘటనలో తూగువారిపల్లెకు చెందిన రైతు రఘునాథరెడ్డి (55) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తూగువారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి మరో ఇద్దరితో కలసి మోటార్ సైకిల్‌పై అంగళ్లు వైపు రాసాగాడు. దొమ్మన్నబావి సర్కిల్ వద్ద బైపాస్ మీదుగా వేగంగా వస్తున్న కారు వీరిపైకి ఒక్కసారిగా దూసుకు వచ్చింది. వేగంగా ఢీకొంది. దీంతో రైతుకు తీవ్ర గాయాలై రెప్పపాటులోనే అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెనుక కూర్చుని వస్తున్న మరో ఇద్దరికి గాయాలు కాగా వారు కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

**యువకులకు గాయాలు**

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట కట్టాపుట్టాలమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిపై బొమ్మవరానికి చెందిన వెంకటరమణ, శంకర సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా తిరుపతికి వెళ్తున్న కారు ఢీకొని తీవ్ర గాయాలు పాలయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించారు.

# ‘కూలి’న బతుకులు

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు.. బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. దొరికిన పనులతో కుటుంబాన్ని నెట్టుకుంటూ వచ్చారు. ఊరిలో జాతర చూసి తిరుగుపయన మయ్యారు. మార్గంమధ్యలో మృత్యువు వారిని కబళించింది. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.



మృతి చెందిన రామాంజులు



కళావతి మృతదేహం



ఢీకొని దెబ్బతిన్న వాహనాలు

- బతుకుదెరువు కోసం వెళ్లి కర్ణాటకలో మృత్యువాత
- రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు దుర్మరణం
- శోకసంద్రంలో కుటుంబం

రామసముద్రం : అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం ఎర్రబోయినపల్లికి చెందిన దంపతులు కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రబోయినపల్లికి చెందిన రామాంజులు(33), కళావతి(28) దంపతులు బతుకుదెరువు కోసం కర్ణాటక రాష్ట్రం వెళ్లారు. అక్కడ కేఆర్ పురం వద్ద కూలీ పనులు చేసుకుంటుండే వారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం గ్రామంలో అమ్మవారి జాతర ఉండటంతో ఇద్దరు పిల్లలను అక్కడే ఇంటి యజమాని వద్ద వదిలి.. సొంత గ్రామానికి వచ్చారు. జాతర ముగించుకుని సోమవారం ద్విచక్ర వాహనంలో కర్ణాటకకు వెళ్లే నేపథ్యంలో.. కళావతికి ఆరోగ్యం బాగలేకపోవడంతో మదనపల్లికి చేరుకుని చికిత్స చేయించుకుని కర్ణాటకకు బయలుదేరారు. మార్గంమధ్యలోని రాయల్పాడు వద్ద టిటి వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. వారి మృతితో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం శ్రీనివాసపురం ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రామ్మోహన్

కడప అర్బన్ : కడప నగర వినాయక నగర్ సర్కిల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కడప ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వల్లూరు మండలం బీచ్ వారిపల్లి గ్రామానికి చెందిన ఇరగబోయిన రామ్మోహన్ (39) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం ఆయనకు వివాహం కాగా భార్య, ఇరువురు ఆడబిడ్డలు ఉన్నారు. ఉదయం 11:30 గంటలకు ఇంటి నుంచి కడపకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వినాయక నగర్ జంక్షన్ సమీపానికి రాగానే, రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



వెంకటరమణారెడ్డి (ఫైల్)



వెంకటరమణారెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన సిద్దువెంకటరమణారెడ్డి (51) అనే రైతు తన పొలంలో విద్యుత్ మోటారు వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం వర్షం కురవడంతో తన వరి పొలానికి సంబంధించిన వ్యవసాయ మోటారును ఆఫ్ చేసేందుకు వెళ్లి.. మోటారు, స్టాటర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై గట్టిగా కేక వేశాడు. ఆ కేక విని పక్క పొలం వారు అక్కడికి వెళ్లి చూడగా స్పృహ కోల్పోయి ఉండటంతో అతని భార్య, బంధువులకు తెలియజేశారు. వారు వెళ్లి వెంకటరమణారెడ్డిని ఆటోలో బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

### బెల్ట్‌షాపులో మద్యం పట్టివేత

ములకలచెరువు : ములకలచెరువు మండలంలోని బురకాయలకోటలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దుకాణంలో నిర్వహిస్తున్న బెల్టుషాపు తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ బీర్లు, మద్యం కలిపి 278 బాటిళ్లు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పరారయ్యాడని ఎక్సైజ్ పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

### భార్యపై భర్త హత్యాయత్నం

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామానికి చెందిన దుంపల వినోద్ కుమార్ అలియాస్ రంగారావు ఉరఫ్ మిడత అనే వ్యక్తి ఆదివారం భార్యను హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు ఎస్సై చిన్న పెద్దయ్య తెలిపా రు. వివరాలు ఇలా ఉన్నాయి. వినోద్ కుమార్ గత కొన్ని నెలలుగా భార్యను వేధింపులకు గురిచేస్తుండగా.. ఇదే క్రమంలో ఆదివారం ఇంట్లో భార్యభర్తలు గొడవకు దిగారు. ఈ క్రమంలో తన భార్యను వినోద్‌కుమార్ చంపేందుకు ప్రయత్నించగా మైదుకూరు రోడ్డు వైపు పరుగులు పెట్టింది. స్థానిక ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో భార్యను పట్టుకుని కత్తితో పొడిచి చంపేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వినోద్ కుమార్‌ను సోమవారం కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించినట్లు ఎస్సై చెప్పారు.

### కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడి పరిస్థితి విషమంగా మారిన ఘటన సోమవారం పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. మండలంలోని పోతుపేటకు చెందిన రైతు నారాయణ (70) పొలం వద్దకు రోడ్డుపక్కన నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నారాయణ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తున్నారు.

**కుక్క అడ్డుగా రావడంతో..**

బైక్‌పై వెళ్తున్న సోదరులు రోడ్డుపై కుక్క అడ్డురావడంతో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. తంబళ్లపల్లెకు చెందిన అజయ్‌కుమార్ (19), ఆది (17) సొంతపనుల కోసం బైక్‌పై మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలోని ముదివేడు వద్దకు రాగానే కుక్క అడ్డుపడింది. దీనితో బైక్ అదుపుతప్పి పడిపోగా తీవ్రంగా గాయపడ్డారు.

## ఈ-నామ్ పద్ధతి మాకొద్దు

- వ్యాపారులతో యార్డు సెక్రటరీ కుమ్మక్కు
- నష్టపోతున్నామని చీనీ రైతుల ఆందోళన



మార్కెట్ యార్డు సెక్రటరీ కార్యాలయానికి తాళం వేసిన రైతులు

పులివెందుల రూరల్ : ఈ-నామ్ పద్ధతి మాకొద్దంటూ చీనీ రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి ఈ-నామ్ పద్ధతిలో చీనీ కాయల వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో చీనీ కాయల ధర తక్కువగా పలుకుతుండటంతో.. ఇలాగైతే తాము నష్టపోతామని రైతులు వ్యాపారస్తులను, మార్కెట్ యార్డు సిబ్బందిని ప్రశ్నించారు. ఎప్పుడూ లేని విధంగా ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఈ-నామ్ పద్ధతి ద్వారా ఎలా వేలం పాట నిర్వహిస్తారని రైతులు ప్రశ్నించారు. దీంతో మార్కెట్ యార్డ్ సెక్రటరీ, రైతులకు మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. మార్కెట్ యార్డ్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి వ్యాపారస్తులతో కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నారని వారు ఆరోపించారు. తమకు ముందు పద్ధతిలోనే వేలం పాట నిర్వహించాలన్నారు. వ్యాపారస్తులతో ఇప్పటికే చాలా వరకు నష్టపోయామని, ఇలా నష్టపరిచే బదులు కాస్త విషమిస్తే తాగి చచ్చిపోయేది మేలు అన్నారు. ఇదిలా ఉంటే వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ ‘అంతా మా ఇష్టం మేము చెప్పినట్లే వినాలి మీరు చెప్పినట్లు వినమంటూ’ చీనీ రైతులను బెదిరించారు. దీంతో కొంచెం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కోపోద్రిక్తులైన రైతులు మార్కెట్ యార్డు సెక్రటరీ కార్యాలయానికి తాళాలు వేశారు. సీఐ సీతారామిరెడ్డి చీనీ కాయల మార్కెట్‌కు చేరుకుని రైతులను శాంతింపచేసి సంప్రదింపులు జరిపారు. ఈ-నామ్ పద్ధతిలో వేలంపాట నిర్వహిస్తామని, తమకు ముందే సమాచారం ఇస్తే మార్కెట్‌కు చీనీ కాయలను తీసుకొచ్చేవారం కాదని, వ్యాపారస్తులతో సెక్రటరీ మాట్లాడుకుని తమకు నష్టం వచ్చే విధంగా చూస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ సీతారామిరెడ్డి జోక్యం చేసుకోవడం వల్ల వ్యాపారస్తులు, రైతులు సమస్యల సర్దుమణగడంతో యథావిధిగా చీనీ కాయల వేలం పాట నిర్వహించారు.

## ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప అర్బన్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్.. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఆయన ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 147 ఫిర్యాదులు పీజీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్పీ పేర్కొన్న ముఖ్య అంశాలు**

- పోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం.
- ప్రజల నుంచి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తాం.
- ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ ఈ.బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారమయ్యే వరకు పనులు జరగనివ్వం

టైలింగ్ పాండ్ వద్ద గ్రామస్తుల నిరసన



టైలింగ్ పాండ వద్ద నిరసనకు దిగిన కె.కె.కొట్టాల గ్రామస్తులు

వేముల : టైలింగ్ పాండ్‌తో తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు పనులను జరగనివ్వబోమని కె.కె.కొట్టాల గ్రామస్తులు పట్టుబట్టారు. టైలింగ్ పాండ్ వద్ద సోమవారం ఉద్యోగాలు, పరిహారంపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు పనులను అడ్డుకుంటామని వారు నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో ముడి పదార్థాన్ని శుద్ధి చేయగా, వచ్చే వ్యర్థాలను కె.కె.కొట్టాల గ్రామ సమీపంలోని టైలింగ్ పాండ్‌కు తరలిస్తున్నారు. ఈ టైలింగ్ పాండ్ నిండు దశకు చేరుకుంది. దీంతో యురేనియం అధికారులు టైలింగ్ పాండ్ ఎత్తు పెంచే పనులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. దీంతో కె.కె.కొట్టాల గ్రామస్తులు టైలింగ్ పాండ్ వద్ద నిరసనకు దిగారు. తమ గ్రామాన్ని, పొలాలు తీసుకుని పరిహారంతో పాటు ఉద్యోగాలు ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. అంతేకాక గత రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేసి.. తమ కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కె.కె.కొట్టాల గ్రామాన్ని, పొలాలను తీసుకుని పరిహారంతోపాటు ఉద్యోగాలు ఇస్తామని యూసీఐఎల్ స్పష్టమైన హామీ ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. అప్పటి వరకు టైలింగ్ పాండ్ ఎత్తు పెంచే పనులు జరగనివ్వబోమని వారు తెగేసి చెప్పారు.



# అధిక వడ్డీ.. తీస్తోంది ప్రాణం

- ప్రొద్దుటూరులో వడ్డీ మాఫియా అరాచకం
- అనుమతులు లేకుండానే ఆఫీసుల నిర్వహణ
- బలైన ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి, శనగల వ్యాపారి ఓబుళరెడ్డి
- దాడులు నిర్వహిస్తున్న పోలీసులు



వడ్డీ వ్యాపారి ఇంటిలో తనిఖీలు నిర్వహిస్తున్న రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐ అరుణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ధనం మూలం ఇదం జగత్.. ఇది మనం ఎప్పటి నుంచో వింటున్న గొప్ప సూక్తి. డబ్బు లేకపోతే ఈ ప్రపంచం మనుగడ సాగించదు, ప్రజలు తమ జీవితాలను కొనసాగించడానికి డబ్బు అనేది చాలా ముఖ్యమైనది, ఈ ప్రపంచాన్ని నడిపించేదే డబ్బు అని ఈ వాక్యం సూచిస్తుంది. డబ్బున్న వాడికే నేటి ఈ సమాజం గౌరవిస్తోందనేది జగమెరిగిన సత్యం. ఆ డబ్బును ఎలా సంపాదించారనేది ఎవరూ పట్టించుకోరు. అతని వద్ద డబ్బుండటమే ప్రధానం. చాలా మంది ఎలాగైనా సరే డబ్బు సంపాదించాలనే ధోరణితో అనేక మార్గాలను వెతుకుతున్నారు. వాటిలో వడ్డీ వ్యాపారం ప్రధానమైంది. నేటి సమాజంలో ధర్మ వడ్డీ, తక్కువ వడ్డీకి అప్పు ఇచ్చే వారు కూడా అక్కడక్కడా ఉన్నారు. ఇలాంటి వాళ్లు ఉండబట్టే అత్యవసర సమయంలో మధ్య తరగతి వర్గాలు, సామాన్యులకు తక్కువ వడ్డీకి డబ్బు సమకూరుతోంది. అయితే ఇలా ధర్మ వడ్డీ, తక్కువ వడ్డీకి అప్పులిచ్చేవారు బహు అరుదని చెప్పొచ్చు. ఇప్పుడు ఎటు చూసినా అమాయకుల అవసరాలను క్యాష్ చేసుకుంటూ దందా సాగించే వడ్డీ వ్యాపారులే అధికంగా ఉన్నారు. జలగల్లా రక్తం పీల్చే ఇలాంటి వడ్డీ వ్యాపారుల చేతిలో చాలా ప్రాంతాల్లో సామాన్యులు, చిరు వ్యాపారులు బలైపోతున్నారు. ప్రొద్దుటూరుతో పాటు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వడ్డీ వ్యాపారులు ఉన్నారు. వీరు ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రధాన రహదారులు, కూడళ్లలో ఫైనాన్స్ ఆఫీసులు పెట్టుకొని నిర్వహిస్తున్నారు. ఆయా ఆఫీసుల్లోనే నిత్యం రూ.కోట్లలో లావాదేవీలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడకుండా వారి అక్రమ వడ్డీ వ్యాపారానికి పరోక్షంగా సహకారాలు అందిస్తున్నారు. ఏదైనా ఘటన జరిగిన సందర్భంలో పోలీసులు ఒకటి, రెండు రోజులు హడావుడి చేస్తారు అంతే.

**వడ్డీ వ్యాపారానికి బలైన వేణుగోపాల్‌రెడ్డి, ఓబుళరెడ్డి**

ప్రొద్దుటూరు, జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారుల ఆగడాలకు ఎంతో మంది బలైపోయారు. అయితే పోలీస్‌స్టేషన్‌ల వరకు వచ్చిన ఈ తరహా ఘటనలు కొన్ని మాత్రమే అని చెప్పొచ్చు. వడ్డీకి డబ్బు తీసుకున్న వారు నిత్యం ఎక్కడో ఒక చోట బలైపోతూనే ఉన్నారు. గత నెల 19న ప్రొద్దుటూరులోని బొల్లవరం ప్లాట్‌లలో నివాసం ఉంటున్న ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆయన హత్యకు వడ్డీకి అప్పులు ఇవ్వడమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆయన వద్ద అప్పు తీసుకున్న వ్యక్తులు డబ్బు తిరిగి చెల్లించే విషయంలో మనస్పర్థలు రావడమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే ఆగస్టు 5న పట్టణంలోని భాకరాపేటకు చెందిన ఉండేల ఓబుళరెడ్డి అనే శనగల వ్యాపారి వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. తనకు అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో విష గుళికలు తిని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొన్నేళ్ల క్రితం జిల్లా ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో ఓ వడ్డీ వ్యాపారిని హత్య చేశారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు, తరచూ వడ్డీ వ్యాపారుల వేధింపులకు సంబంధించి పోలీసులకు వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని ప్రొద్దుటూరులోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, ఆఫీసుల్లో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయా ఇళ్లు, ఆఫీసుల్లోని బాకీదారుల ప్రామిసరి నోట్లు, ఇతర పత్రాలను పరిశీలించారు. అప్పు ఇచ్చిన వ్యాపారులు అధిక వడ్డీల కోసం బాకీదారులను ఇబ్బంది పెట్టరాదని, ఇబ్బంది పెట్టినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పట్టణంలో పెద్ద మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్న పలువురు ఫైనాన్షియర్లను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. పోలీసుల దాడులు, హెచ్చరికల నేపథ్యంలో స్థానికంగా కొందరు వడ్డీ వ్యాపారులు కొన్ని రోజుల పాటు తమ కార్యాలయాలకు తాళం వేశారు. కాగా గతంలో ప్రొద్దుటూరుతోపాటు జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారులు రుణ గ్రహీతలను వేధిస్తున్నట్లు పోలీసులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. వాటిని పోలీసులు పరిశీలిస్తున్నారు.

**ప్రొద్దుటూరులో వడ్డీ మాఫియా ఆగడాలు**

రాయలసీమలోనే ప్రొద్దుటూరు వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. బంగారు వ్యాపారంలో రెండో ముంబైగా ప్రొద్దుటూరుకు పేరు. తర్వాత వస్త్ర వ్యాపారాలు కూడా పెద్ద ఎత్తున ఇక్కడ జరుగుతాయి. చిన్న చిన్న దుకాణాలైతే లెక్క లేనన్ని ఉన్నాయి. ఆయా దుకాణాల్లో వేల సంఖ్యలో కార్మికులు, గుమస్తాలు పని చేస్తున్నారు. ఇక్కడ రూ. వెయ్యి మొదలుకొని రూ.వందల కోట్లలో అప్పులు ఇచ్చే ఫైనాన్షియర్లు చాలా మందే ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని సినీ పరిశ్రమకు ప్రొద్దుటూరు ఫైనాన్షియర్లు ఫైనాన్స్ ఇస్తున్నారంటే ప్రొద్దుటూరు రేంజ్ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. వ్యాపారాలకు తగ్గట్టుగానే ఇక్కడ వడ్డీ వ్యాపారులు పెద్ద ఎత్తున ఉన్నారు. కొందరు ఇళ్లలోనే ఆఫీసులు పెట్టుకొని వ్యాపారం జరుపుతుండగా.. ఇంకొందరు పట్టణంలోని అనేక ప్రాంతాల్లో విలాసవంతమైన ఆఫీసులు ఏర్పాటు చేసుకొని దందా చేస్తున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేకున్నా బహిరంగంగా వడ్డీ వ్యాపారం సాగిస్తున్నారు.


**రూ.10 నుంచి రూ.15 వరకు వడ్డీ**

‘వడ్డీ ముందు గుర్రం కూడా పరుగెత్తలేదు’ అనే సామెత ఎప్పుడో మన తాతలు, ముత్తాతల కాలం నాటిది. ఇప్పటి పరిస్థితులను చూస్తే ‘వడ్డీ ముందు బుల్లెట్ ట్రైన్ కూడా పరుగెత్తలేదు’ అనే సామెతను చెప్పుకోవాల్సి వస్తోంది. నేడు ధర్మ వడ్డీ అనే మాట మచ్చుకైనా వినిపించదు. అమాయకుల అవసరాలను క్యాష్ చేసుకుంటూ వడ్డీ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు వడ్డీ వ్యాపారులు. బాధితుల అత్యవసరాన్ని బట్టి అధిక వడ్డీలు వసూలు చేస్తూ జేబులు నింపుకొటున్నారు. చిరువ్యాపారులే టార్గెట్‌గా చేసుకొని రూ.10-15 వరకు వడ్డీ వసులు చేస్తున్నారు. ఇక అప్పు తీసుకున్న వారు వడ్డీ ఇవ్వడం ఆలస్యమైతే.. వారి నడ్డి విరగొట్టి మరీ వసూ లు చేస్తున్నారు. భౌతిక దాడులకు కూడా వెనకాడటం లేదు. ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. వీటిని నిర్వహించే జూదరులకు కొందరు ఫైనాన్షియర్లు రూ.15-20 వడ్డీకి అప్పు ఇస్తున్నారు.

**ఆత్మహత్యలకు దారి తీస్తున్న అప్పులు**

అవసరానికి అప్పు ఇవ్వడం తప్పుకాదు. కానీ వడ్డీకి అప్పులిచ్చిన వారు వసూలు కోసం అనేక విధాలుగా బలవంతం చేయడంతో వారు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అవసరాలకు అధిక వడ్డీకి అప్పు తీసుకొని.. తర్వాత తీర్చలేక చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ తరహా ఘటనలు జిల్లా వ్యాప్తంగా ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులు, రోజు వారి కూలీలు, వివిధ రంగాల్లో పని చేసే కార్మికులు, సామాన్య ప్రజలను వనరులుగా మలుచుకొని వడ్డీ వ్యాపారులు దందాలు సాగిస్తున్నారు. సామాన్యులు, చిరు వ్యాపారులు, రైతులకు పెను శాపంగా మారిన అధిక వడ్డీదారుల నుంచి రక్షించేందుకు ప్రొద్దుటూరు పోలీసు అధికారులు రంగంలోకి దిగారు.

### అధిక వడ్డీలకు అప్పులిస్తే చర్యలు



పట్టణంలో ఎవరైనా అధిక వడ్డీలకు అప్పులిస్తే చర్యలు తీసుకుంటాం. రూ.3, రూ.5, రూ. 10 ఇలా ఎక్కువ వడ్డీకి అప్పులిచ్చినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఖాళీ ప్రామిసరి నోట్ మీద సంతకం చేయించుకొని డబ్బు ఇవ్వరాదు. డబ్బు వసూలుకు ఇళ్ల వద్దకు రౌడీలను పంపితే తీవ్ర పరిణామాలు తప్పవు. పట్టణంలో అధిక వడ్డీకి అప్పులిచ్చే వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరిస్తున్నాం. వీరిపై ఫిర్యాదులు వస్తే మాత్రం కేసులు నమోదు చేస్తాం.

– పి.భావన, డీఎస్పీ, ప్రొద్దుటూరు

### మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం

కేసు మాఫీ చేసేందుకు టీడీపీ నేతలు ప్రయత్నం

గుర్రంకొండ : మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం తరిగొండలో చోటుచేసుకుంది. అయితే కేసును మాఫీ చేసేందుకు టీడీపీ నేతలు సోమవారం సాయంకాలం వరకు పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో విశ్వప్రయత్నం చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ మహిళ స్థానిక కృష్ణారెడ్డి వీధిలో నివాసం ఉంటోంది. గత కొంత కాలంగా జీవనోపాధి నిమిత్తం తిరుపతి పట్టణంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన మానసిక దివ్యాంగురాలు అయిన కుమార్తె (32)తో కలిసి జీవనం సాగిస్తోంది. ఆమె కుమారుడు తరిగొండలో నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మానసిక దివ్యాంగురాలు తరిగొండలో ఉన్న తన అన్న వద్దకు తిరుపతి నుంచి బయలుదేరింది. ఈ విషయం ఫోన్ ద్వారా ఆమె తల్లి కుమారుడికి తెలియజేసింది. మానసిక దివ్యాంగురాలు తిరుపతి నుంచి వాల్మీకిపురం చేరుకొని అక్కడి నుంచి తరిగొండకు బస్సులో వచ్చింది. గ్రామంలోని సచివాలయం వద్ద నిలుచొని తాను వచ్చానని, వచ్చి తీసుకెళ్లాలని అన్నకు సెల్‌ఫోన్‌లో చెప్పింది. అయితే ఆ ఫోన్‌లో అదే వీధిలో నివాసముంటున్న సయ్యద్ నయాజ్ అలీ(27) అనే యువకుడు మాట్లాడాడు. మీ అన్న పని మీద ఉన్నాడని, తాను వచ్చి తీసుకెళతానని నమ్మబలికాడు. వెంటనే ద్విచక్రవాహనం తీసుకొని నయాజ్‌అలీ అక్కడికి వచ్చాడు. ఆమెను బైక్‌లో ఎక్కించుకొని గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ పక్క వైపు వెళ్లాడు. ఆమెకు అనుమానం రావడంతో తనను ఎక్కడికి తీసుకెళుతున్నావని గట్టిగా నిలదీసింది. దీంతో కంగుతిన్న నయాజ్‌అలీ ద్విచక్రవాహనాన్ని పొదలపక్కన నిలిపి వేసి.. ఆమెను బలవంతంగా పొదల వైపు లాక్కెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. గట్టిగా కేకలు వేసి అతడి చర్యలను ప్రతిఘటించి అక్కడి నుంచి బయటపడింది. జరిగిన సంఘటనను తిరుపతిలో ఉన్న తన తల్లికి తెలియజేసింది. తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై సోమవారం గుర్రంకొండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురామ్ తెలిపారు. మండలానికి చెందిన కొంత మంది టీడీపీ నాయకులు నిందితుడి తరఫున రంగప్రవేశం చేసి కేసును మాఫీ చేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే వీరి ప్రయత్నాలు ఫలించక పోవడంతో పోలీసులు కేసు నమోదు చేయడం కొసమెరుపు.